'ప్రభవ' మాసపత్రిక -1978

# నాటకం

అత్యవసర కమిటీ మీటింగు -

"ఇదన్యాయం" - బల్లగుద్ది అన్నాడు యూనియన్ సెక్రట్రీ లక్ష్మీపతి.

"ఎంచేత?" అడిగాడొక కమిటీ మెంబరు.

"ఎంచేతేమిటి? డిపార్టుమెంటులో వున్న సీనియర్స్‌ను కాదని గోపాల్‌ని ఫారన్ టూర్ - జపాన్‌లో ఆర్నెల్ల ట్రయినింగ్ ప్రోగ్రాంకి - పంపడం న్యాయమా? అయోగ్యుణ్ణి, అర్హత లేనివాణ్ణి సెలక్టు చేసి పంపిస్తుంటే మనం చేతులు ముడుచుకుకూర్చోవడం న్యాయమా? చెప్పండి. గోపాల్ మన కంపెనీ జి.యమ్. గారి పుత్రుడు గాబట్టి - అతగాడికో న్యాయం, మిగతావాళ్ళకో న్యాయమా? చెప్పండి.

"ఈ అన్యాయం గురించి అడగడానికి పర్సనల్ ఆఫీసరు రంగబాబు దగ్గరికి వెళ్తే ఆయన ఏమన్నాడో తెల్సా - అనవసరమైన విషయంలో యూనియన్ కలుగజేసు కుంటోందట. సీనియారిటీ ప్రమోషన్లకి అన్నారంటే కొంత అర్థముంది గాని, ట్రయినింగ్ ప్రోగాంలకి కూడా సీనియారిటీ అనడం అర్థం లేదట. అయినా గోపాల్ పేరు ఆ డిపార్టుమెంటు హెడ్ రికమెండ్ చేశాడు గాబట్టి తనేం చేయలేడట. గోపాల్ ఎఫిషియంట్ కాండిడేట్ కాకుండా ఆయన మాత్రం ఎందుకు రికమెండు చేస్తాడు? - అన్నాడు. ఎందుకు గోపాల్ని రికమెండ్ చేశాడన్నది మీరు అతన్నడగడం మంచిది నన్ను కాదు అన్నాడు పెడసరంగా రంగబాబు.

"ఎందుకు రికమెండు చేశాడో తెల్సుకుందామని ఆ హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంట్ దగ్గరి కెళ్లేం. కుర్చీలో పిప్పళ్ళ బస్తాలా కూర్చొని వాడేమంటాడో తెల్సా - 'మిస్టర్ లక్ష్మీపతి - నీవు ఆరు వందల ఎంప్లాయిస్‌కి లీడర్‌వే కావొచ్చు కాని నేను ఈ డిపార్టుమెంటు హెడ్డుని. అంచేత నేను ఏది నిర్ణయించాలో నాకు తెల్సు. నన్ను, నా నిర్ణయాన్ని నిలదీసి ప్రశ్నించే హక్కు నీకు లేదు. అర్థమయిందా - ట్రయినింగ్‌కి ఎవర్ని పంపాలో నిర్ణయించాల్సింది నీవా? నేనా? నీవే అయితే నేనెందుకికక. కమాన్ నా ఛెయిర్లో కూర్చో' అంటూ మేనర్‌లెస్‌గా బిహేవ్ చేశాడు ఆ తెడ్డు మొహం హెడ్డు.

"అందుకే ఇపుడు అత్యవసర సమావేశం జరిపేది. యాజమాన్యం నన్నీవిధంగా అవమానం చేసింది. నన్నంటే ఈ యూనియన్ని, ఈ ఆరు వందల ఎంప్లాయీస్‌ని అవమానం చేసింది. అంచేత మనమంటే ఎవరో, మన శక్తేమిటో వాళ్ళకి తెలియజేయాలి. ఈ ట్రయినింగ్ ప్రోగ్రాంని ఎంతమాత్రం ఉపేక్షించి యాజమాన్యానిది గెలుపు కానియ్యగూడదు. ఇది మన

ప్రెస్టేజ్‌కి సవాల్."

ఉద్రేకం ఇంజక్టయిన మెంబర్సు "అయితే ఏం చేద్దాం?" అన్నారు వూగిపోతూ.

"అందుకు ఒకటే పద్ధతి"

"ఏమిటి?"

"పెన్ డౌన్ స్ట్రయిక్"

మెంబర్సంతా క్షణమాగి "ఆల్‌రైట్" అని ఆమోదించేరు.

❁ ❁ ❁

పెన్‌డౌన్ చేస్తున్నారనగానే జి.ఎం. బ్రహ్మాజికి బ్రహ్మాండమైన కోపం, చిరాకు వచ్చేశాయి. బ్రహ్మాజికి ఎదురుగా డిప్యూటీ జి.యమ్. సుధాకర్, పర్సనల్ ఆఫీసరు రంగబాబు కూర్చున్నారు.

రంగబాబుతో, "వాటీజ్ దిస్ న్యూసెన్సు" అన్నాడు బ్రహ్మాజీ కుర్చీలో ఇబ్బందిగా కదిలి. ఆ న్యూసెన్సుకంతా తనే కారకుడన్నట్టుగా "యస్ సార్" అన్నాడు కంగారుగా రంగబాబు.

"యస్సు గిస్సు కాదు. ఆ పెన్‌డౌన్ స్టాప్ చేయించు - ఇమిడియట్‌గా"

"ఎలా సార్?"

"వండర్‌ఫుల్. ఎలాగో నేను చెప్పాలి - పర్సనల్ ఆఫీసర్వి నీ వెందుకయ్యామరి?"

రంగబాబు ముఖం చిన్నబోయింది.

బ్రహ్మాజీ తనెవ్వరితోనూ తన కొడుకునే జపాన్ ట్రయినింగ్ ప్రోగ్రాంకి సెలక్టు చేయమని హుకుం జారీ చేయలేదు. కనీసం మాటవరసకైనా అనలేదు. కాని మనవాళ్ళకి వ్యక్తిపూజ ఎక్కువ. వీలు దొరికినప్పుడల్లా దండం పెట్టి భజన చేయకుండా వుండలేరు. భజన దాసైన ఆ హెడ్‌గారు బ్రహ్మాజీగారి ఫేవర్ సంపాదిద్దామని బ్రహ్మాజీగారి కొడుకు పేరు రికమెండ్ చేసేశాడు. పెద్దలు ఏ గొడవ లేకుంటే భజనదాసుల్ని ఆశీర్వదిస్తారు. కోరికలు చెల్లిస్తారు. కాని ఆ భజనే చిక్కులు తెప్పిస్తే చికాకు పడిపోతారు. చిందులు తొక్కి 'ఏంటయ్యా ఈ న్యూసెన్సు' అంటారు.

ఇపుడేం చేయడం?

ఏం చేద్దామన్నా, తనకిపుడు టైం లేదు. మరో గంటలో బొంబాయికి తను ఎయిర్‌లో వెళ్ళాల్సిన ప్రోగ్రాం వుంది. వెళ్ళక తప్పదు. నెలకి పదిహేను, ఇరవై రోజులు గాల్లోనే వేలాడవల్సి వస్తోంది - సెమినార్స్, మీటింగ్స్ వల్లకాదూను.

తను లేనప్పుడు ఆక్టింగ్ జి.యమ్. సుధాకర్.

చెప్పాలంటే కంపెనీ ఎఫైర్స్, ప్రొడక్షన్ ప్లానింగ్ అంతా చూసుకునేది సుధాకరే. సుధాకర్ ఆ కంపెనీలో చాలా సీనియర్ కూడా. గత ఏడాది జి.యమ్. పోస్టు ఖాళీ అయితే అంతా సుధాకరే జి.యమ్‌గా ప్రమోట్ అవుతాడనుకున్నారు. తనకున్న పలుకుబడిని కూడా ఉపయోగించేడు. కాని లాభం లేకపోయింది. పరిశ్రమల మంత్రి గారి కాండిడేట్ బ్రహ్మాజి

సర్మని వచ్చి సుధాకర్ని తోసి సీటులో కూర్చున్నాడు. అప్పటినుంచి సుధాకర్కి బ్రహ్మాజీ అంటే కసి, కోపం, అసూయ... ఆ జాతికి చెందినవన్నీ అతనిలో ప్రవేశించాయి.

పెన్డౌన్ గొడవ రంగబాబుకి, కంపెనీ బాధ్యతలు సుధాకర్కి అప్పచెప్పి టైమవుతోందని కారుని ఎయిర్పోర్టుకి పోనిచ్చేడు బ్రహ్మాజీ.

* * *

రంగబాబుకి పెద్ద చిక్కే వచ్చిపడింది.

లక్ష్మీపతితో కూర్చున్న టాక్స్ ఫెయిల్ అయినాయి. రెండు గంటల్నించి పెన్డౌన్ విజయవంతంగా సాగుతోంది. అందరూ పనులు మానేసి చేతులు కట్టుకు కూర్చున్నారు. రంగబాబు చేసిన 'రింగ్'లు విని ఆఫీసర్లు కుర్చీల్లోంచి లేచి 'మెమోలిస్తాం పనిచేయకపోతే జాగర్త' అని ఎంప్లాయిస్ని భయపెట్టేరు. 'కాన్ఫిడెన్సియల్ రిపోర్టు కరాబు చేస్తాం. జాగర్త' అని బెదిరించేరు. అయినా ఏ ఒక్క వైట్ కాలరూ భయపడలేదు. బెదరలేదు. అంతా యూనిటీ చూపించేరు. ఆ గొప్పతనం ఎంప్లాయిస్ది అనేకన్నా లక్ష్మీపతి ఆర్గనైజింగ్ దనడం సబబు.

రంగబాబు కిందా మీద అయిపోతుంటే "డోంట్ వర్రీమాన్" అన్నాడు సుధాకర్.

"చూడు నేను సమస్యను పరిష్కరిస్తాను" అన్నాడు.

"అంతకన్నా కావల్సిందేం వుంది సార్" అన్నాడు రంగబాబు.

కాని ఏం చేస్తాడో చూడాలి –

పి.ఎ.కి రింగ్ చేసి గోపాల్ని పిలిపించేడు సుధాకర్.

సుధాకర్ గోపాల్ని కూర్చోమన్నాడు. గోపాల్ కూర్చున్నాడు.

"కాగితం, కలం తీసుకో" అంటూ లెటర్పాడ్, పెన్ను అతని ముందుకి తోసేడు సుధాకర్.

గోపాల్కి అర్థంకాక 'ఎందుకు' అన్నట్టు చూసేడు.

గోపాల్కే కాదు రంగబాబుకీ అర్థం కావడం లేదు. అంత పర్సనల్ ఆఫీసరూ ప్రేక్షకుడై కూర్చోవల్సివచ్చింది. జి.యమ్.గారి కొడుకు కేసయ్యె, అడ్డంగా అడుగేశామంటే బ్రహ్మాజిగారు బతకనీయడు. ఏది ఏమైనా ఇపుడు సుధాకర్ మద్దెకొచ్చాడు గాబట్టి అతని మీదకే తోసేయవచ్చు అని రంగబాబు ఆలోచన.

"వెరీ సారీ గోపాల్, నిన్ను ఫారెన్ పంపిస్తామంటే – ఆ యూనియన్ వెధవలకేం తెగులో అర్థం కాదు. వీల్లేదు, వీల్లేదంటూ పీకలు కోసుకుంటున్నారు. పెన్డౌన్లు చేసేస్తున్నారు. వాళ్ళ తెలివి తక్కువ పనికి మనం ఇప్పటికే రెండున్నర గంటల పనికాలం పోగొట్టుకున్నాం. అంటే లక్ష రూపాయలైనా లాసు అయుంటుంది. ప్రొడక్షన్స్ గురించి యూనియన్లు ఎలాగూ ఆలోచించవు – మానేజిమెంటే ఆలోచించాలి. అవునా? కాదా?"

అవును, కాదు అనకుండా 'చెప్పండి' అన్నాడు గోపాల్ ముక్తసరిగా.

"మానేజిమెంటు పరువు నిలబడాలన్నా, ప్రొడక్షను పడిపోకుండా వుండాలన్నా – అది

నీ చేతిలోనే వుంది" అన్నాడు సుధాకర్.

"చిత్రంగా మాటాడుతున్నారు."

"లేదు. నిజం. నీ చేతుల్లోనే వుంది."

"చెప్పండి ఏం చేయమంటారో."

"మరేం లేదు. నీవు మాకు రాసివ్వాలి."

"ఏమని?"

"జపాన్ ట్రయినింగ్ ప్రోగ్రాంకి వెళ్ళడం ఇష్టం లేదని"

"నాకెందుకిష్టం లేదు?"

"కొన్ని అనివార్య కుటుంబ పరిస్థితుల వల్ల."

"బాగుంది సార్ బాగుంది. నా గురించి మీరు చెప్పడం చాలా బాగుంది. ఫర్ యువర్ ఇన్ఫర్మేషన్. నాకెలాంటి అనివార్య కుటుంబ పరిస్థితుల్లేవు. నాకు ట్రయినింగ్ ప్రోగ్రాంకి వెళ్ళడం ఇష్టమే!"

రంగబాబుకి చెమట పట్టేస్తోంది. రుమాలు తీసి ముఖం తుడుచుకున్నాడే గాని మాటాడలేదు. డిపార్టుమెంటల్ హెడ్డు కూడా అక్కడే వున్నాడు కుక్కిన పేనులా.

సుధాకర్ మటుకు చలించలేదు. తన ధోరణి కొనసాగించేడు.

"చూడు గోపాల్. కంపెనీ శ్రేయస్సు దృష్ట్యా నిన్నలా రాసియ్యమంటున్నాను."

"మీరు నన్ను అవమానిస్తున్నారు."

"అవమానమా?"

"కాదా? ప్రోగ్రాంకి నన్ను పంపమని నేను అడగలేదే? మా డాడీ కూడా పంపమనలేదే. మీరే పంపుతున్నాం అని 'టాం, టాం' చేసి ఇపుడు వెళ్ళడానికి వీలు కాదంటున్నారు. నా చేతే నాటకం ఆడిస్తున్నారు. 'నా కిష్టం లేదని' రాయాలట. ఈ పథకం అంతా నన్ను నా తోటి ఎంప్లాయిస్ ముందు తలెత్తుకు తిరగనీయకుండా చేయడానికే చేశారంటాను. ఇంతకన్నా అవమానం ఇంకేవిఁటి?"

హెడ్ అందుకున్నాడు – "నో నో, అది కాదు గోపాల్. నీవు మనవాడివేనని ఫేవర్ చూపించేం. అంతే. కానిది ఇలా దారి తీస్తాదనుకోలేదు."

"సార్. ఆ మాటన్నందుకు సిగ్గుపడండి. ఫేవరు ఎందుకు చూపాలి? ఎవరు చూపమన్నారు? మా డాడీ దగ్గిర ప్లస్ మార్కులు కొట్టేసి ప్రమోషన్లు పొందేద్దామని దురాశ. అందుకు నన్ను ఉపయోగించుకున్నారు. ఇప్పుడు పీకల మీదకు రాగానే మళ్ళీ 'మీరేదో డిక్టేట్ చేసింది రాయమంటూ' నన్ను బలవంతం చేసి ఉపయోగించుకుంటున్నారు. నేను మీకెలా కనిపిస్తున్నాను? చెప్పినట్టు ఆడే మరబొమ్మ ననుకుంటున్నారా? నాకు వ్యక్తిత్వం, ఆత్మగౌరవం లేవనుకున్నారా? ఈ కుర్రకుంక రాయకేం చేస్తాడని పెన్ను, పాడ్ ముందు పడేశారు. ఏం అధికార మదం? ఎంత నిరంకుశత్వం? నేనలా రాయనంటే మీరేం చేస్తారు?"

అని గోపాల్ అనేటప్పటికి రంగబాబు మరోసారి రుమాలుతో ముఖం తుడుచుకున్నాడు. సుధాకర్ ఈ సమస్యను ఇంకా పెద్దదిగా, జటిలంగా చేసేస్తున్నాడేమోనని భయం కలిగింది.

సుధాకర్ 'ఈ కుర్రకుంకగాడు రాసివ్వడు లాగుందే' అనుకున్నాడు. కాని గోపాల్ "సార్? మీరు కోరుకున్న పని నేను గంట క్రితమే చేయడం జరిగింది" అని జపాన్ ప్రోగ్రాం నా కిష్టం లేదంటూ రాసిన కాగితం జేబులోంచి తీసి వాళ్ళ ముందు పెట్టేడు. "నేనీ పని ఆరు వందల ఎంప్లాయిస్ తీర్పు విని, తప్పుకోవడం నా ధర్మం అని కాగితం రాసేను. ఏమైతేనేం మీరనుకున్నది అదేగా తీసుకోండి. వస్తా" అంటూ గోపాల్ సర్రమని లేచి, కుర్చీని పడదోసుకుని మరీ, డోర్ ధనేలున చప్పుడు చేసి మరీ విసవిసా వెళ్ళిపోయేడు.

✿ ✿ ✿

"మీరు ఎందుకోసం పెన్‌డౌన్ చేస్తున్నారో ఆ వ్యక్తే జపాన్ ప్రోగ్రాం వెళ్ళనంటున్నప్పుడు ఇంకెందుకయ్యా పెన్‌డౌన్‌లూ, పంతాలూ" – కోపంగా సుధాకర్ లక్ష్మీపతిపై గోపాల్ రాసిన కాగితం పడేశాడు.

"పోనీలెండి. ఎలాగోలా సమస్య తీరింది – మీరు, మేము పంతాలకి, పోరాటాలకి దిగకుండా. ఈ విషయంలో పెన్‌డౌన్ తర్వాత నిరవధిక సమ్మెకి కూడా రడీ అయ్యేం మేము. ఆ ప్రమాదం లేకుండా దాటిపోయింది సంతోషం. కాని దీని సంగతి ఏమిటి?..."

"దేని సంగతి?"

"పెన్‌డవున్ చేసిన రెండున్నర, మూడు గంటలకి పే కటింగ్ చేయగూడదు. ఎవరికీ మెమోలు వగైరా ఇష్యూ చేయగూడదు. కాన్ఫిడెన్షియల్ రిపోర్టు కరాబు చేయకూడదు."

"అదెలాగవుతుంది? పనిచేయని కాలానికి పే ఎలా ఇస్తాం" అని రంగబాబు అనబోతుంటే, సుధాకర్ వూరుకోమని సౌంజ్ఞ చేసి – "అంతేకదయ్యా, లక్ష్మీపతీ అలాగే కానియ్" అన్నాడు.

రంగబాబు విస్తుబోయేడు. సుధాకర్ రాజకీయం అతనికి అర్థం కాలేదు. అర్థం గాక ఈసారి ముఖం తుడుచుకోవడం బదులు బుర్ర గోక్కున్నాడు.

✿ ✿ ✿

"శెభాష్ లక్ష్మీపతి శెహ్‌బాష్." అని కార్మిక నాయకుడు లక్ష్మీపతి వీపుపై అప్యాయంగా చరిచేడు ఏ.జి.యం. సుధాకర్.

'మనవంటే ఏటనుకున్నారు. ఎంప్లాయిస్‌ని గొర్రెల్లా ఆడించగల గ్రేట్ లీడర్ని' అన్నట్టు మీసాలు తిప్పేడు లక్ష్మీపతి.

"నీవు గ్రేట్ లీడర్వి కాకపోతే నిన్నెందుకు పెన్‌డవున్ చేయించమంటానోయ్. నీ కెపాసిటీపై నమ్మకం లేకుంటే నా ఎనిమీ సన్ – గోపాల్‌గాడ్కి జపాన్ ప్రోగ్రాం తగలనీయకుండా అల్లరెందుకు పెట్టమంటానోయ్... ఎనీవే మనిద్దరి రిలేషన్సు ఇలానే ఇకముందూ కొనసాగాలి. అధికారం మన చేతులలోను, ఉద్యోగులు మన కాళ్ళ కిందా వుండాలి – ఓ.కే."

"ఛీర్స్" అంటూ ఇద్దరి చేతులలోను విస్కీ గ్లాసులు గాలిలోకి లేచేయి. ✿